

# పెట్టుమెచ్చినపల్లె

భూపాల్ · లేఖా నవలిక

24.10.'80.

శుక్రవారం

హైద్రాబాద్.

ప్రియమైన వసంతా!

మనం వుట్టి పెరిగిన ఊరి మీద ప్రేమ ఉండాలే గని కూడు దొరకని రోజుల్ల గూడ ఆడనే వుండాలని లేదు. నేను భయపడో, కానివని చేసో ఊరిడిసి రాలేదు. నాకన్న నీకే ఆ సంగతులెక్కువ తెలుసు. ఎన్నటికైనా నేను నా ఇల్లు, నా భూమిని మల్ల తీస్కుంటనని నాకు తెలుసు. నీ రొండు ఉత్తరాల సంది మీ నాయిన ఎట్లున్నడో ఏం రాస్తలేవు! ఈసారాన్న మర్సిపోకుండ రాయి. ఊరి సంగతులు కూడ.

మొన్న పన్నెండో తారీకున మన రాష్ట్రానికి కొత్త ముఖ్యమంత్రి అంజయ్య అయ్యిండు. చెన్నారెడ్డి దిగిపొయ్యిండు. ఈ ముఖ్యమంత్రి కార్మికులల్ల కెల్లి ఒచ్చిండట. ఇగ కార్మికుల బతుకులన్ని మంచిగైపోతయంటున్నరు. రాంగనే ఇగ అంత మారి పోతదని ఇందిరాగాంధి ఇరువై సూత్రాలకు సచ్చిపోయిన సంజయ్‌గాంధి ఐదు సూత్రాలు కలిపి ఇరువైఐదు రోజుల పండుగ మొన్నటినందే మొదలు వెట్టిండు.

ఇయ్యాల పేపర్ల సదివిన ఇంకో ముఖ్యమైన ముచ్చట నీకు జెప్పాలె. జాతీయ ప్రణాళిక వ్యవసాయ మంత్రి కేదార్ పాండె అనెటాయన జెప్పిండట. యాభైవేలకోట్లు రూపాయలు ఖర్చు వెట్టి నదులన్ని ఒకదానికొకటి కలిసే పతకం ఏసింద్రట. మనదేశం నిండ ఇగ మూడున్నర కోట్ల హెక్టార్ల భూమికి నీళ్లు అందుతయి. అంటే మన ఊరిని గూడ అనుకొని నదులు,కాల్వలు, పార్తయన్నమాట. ఇట్ల రాస్తుంటే 'లొటపిట పెదవులకు నక్కాశ వడ్డట్టు' అనుకోకు. సూద్దాం.

నీ ఉత్తరం రాసిన సంటోణి బాధలు జూస్తుంటే అంత సిన్న వయసుల ఇన్ని బాధలా అనిపిస్తది. ఇక్కడ నాల్గురోజుల క్రింద కన్న తండ్రే సంపేసిన మూడేండ్ల పాప నా కండ్లల్ల మెదులుతుంది.

నేనుండే మా ఇంటికి సరిగ్గా మూడు ఫర్లాంగుల దూరంల (మన ఊరి బొడ్రాయికాడి కెల్లి ఊరి పడమటున్న మాదిగిండ్ల వరకన్న మాట) నాల్గునెల్లకింద నాకో కొత్త పాలరాతం కుదిరింది. రోజు లీటరు పాలు దీస్కుంటరు. అందరు పాల పైసలు ప్రతినెల మొదటివారంలిస్తే ఈళ్లు మాత్రం ప్రతినెల ఇరవై తారీక్కు టంచెన్గ పైసలిస్తరు. ఆ ఇంటాయన పేరు వెంకటేశ్వరరావు. ఈస్టుగోదావరి నుండి ఒచ్చిండట. సర్వే ఆఫ్ ఇండియాల మంచి కొలువు. ఇక్క పిల్ల మూడేండ్లది. భార్యతోటి ముగ్గురే అల్ల సంసారమంత. ఆమె సూస్తే నిర్మలంగుంటది. ఆమె నవ్వితే పూవు పూసినట్లుంటది. ఆమె పలకరిస్తే ప్రేమతోటి సల్లగాలి ఇసిరినట్లుంటది. అంతగూడి ఆమె అందంగ వుంటదని చెప్పొచ్చు. పేదింట్ల వుట్టిందో ధనికునింట్ల వుట్టిందో గని నాకు ఆమెను జూస్తే గిసొంటి ఇంకో అక్కుంటే ఎంత బాగుండు ననిపిస్తది. ఆమెను రోజు సూసి పాలు పోసెటప్పుడు 'నమస్తే అక్కా!' అనాలనిపిస్తది గని, వారం రోజులకొక్కసారి కనిపిస్తే ఎక్కువే. తెల్లారి ఆమె లోపట ఒంట పన్లు జేసుకుంట ఉంటది గావొచ్చు. వెంకటేశ్వరరావు నిద్రలేసి లుంగీ ఊడూడిపోతుంటే నిద్ర కండ్ల తోటి పాలు దీసుకుంటడు. తీస్కపోతుంటే నిద్రమత్తుల అవి కింద పారవోస్తడేమో అనిపిస్తది. అప్పటికే అల్ల పాపలేసి "అమ్మా పాల మామియ్యా! అమ్మా పాల మామియ్యా" అనే ఒచ్చీరాని లేత మాట లోపటికెల్లి ఇనిపించేది. ఎప్పుడన్నా పగలు అల్ల ఇంటి ముంగటి కెల్లి నేను పోతుంటే రమ్మని పిలిసి ప్రేమతోటి మాట్లాడి 'ఛా' చేసిచ్చేది. అదీ నాల్గునెల్లల్ల రెండుసార్లు తాగిన.

ఆమె ఉన్నప్పుడు ఇల్లు ఎంత సప్పుడు జెయ్యకుంట ఎవ్వరు లేనట్టు ఉండేదో ఆమె ఏడికన్నా ఒకటి రెండ్రోజులు పోతే ఆ ఇల్లు లోపల కొట్లాట, బూతుల కొట్లాట, విస్కి బ్రాందీల వాసన, పేకాటతోటి నిండి వుండేది. ఎందుకో తెల్వదుగాని ఆమె లేనప్పుడు గూడ పొద్దూకి అద్దె లీటరు పాలు తెమ్మని జెప్పుండే. పాలు తీస్కపొయ్యి బైట నిలవడి పిలిస్తే పది నిమిషాలవరకు కిటికీల కెల్లి నన్ను సూసుకుంటనే పాలు తీసుకుంటోడు గాదు. అప్పటికే అల్ల మాటలు నా చెవ్వుల్ల నిండీ పల కజెమ్మిడి చెట్లలెక్క మొలిచేయి, నిలిచేయి. 'అది అట్లుందంటే, ఇది ఇట్లుందని', 'దాని నడుము' అని ఒకడంటే 'దాని నడక' అని ఇంకొకడు. 'ఆ అమ్మాయి నాని కలవాటు' అంటే 'వాడేగాదు నీకు గూడ' అని ఒకడు. ఫలాందాన్ని దెగ్గరికి పది వేలిచ్చన్నా పొయ్యొస్తనని ఒకడంటే, 'ఇరవై రూపాయలు చాలు రా' అని ఇంకోడు. అల్లు మాట్లాడేవన్ని బూతులే. అవి ఇనలేక నాకు పెయ్యి మండేది. ఆమె ఉన్నరోజుల్లనైతే ఏ సప్పుడుండేది కాదు.

> "నన్ను జేసుకోవాలని ఆయనకెంతో ఇష్టముండే నేనంటే పానమెల్లగొట్టుకుంటుండే"

మూడు నెల్ల పాల పైసలు నాకు ముట్టినయి. నాల్గోనెల పందొమ్మిది నాడు పాలు పోసిన ఆమెనే తీసుకున్నది. ఇరవైనాడు పాలు పోసి పైసలిస్తరు తీసుకొద్దామని పోతే ఇంటికి తాళముంది. నెల పైసలియ్యాలె. మరునాడు తాళమే. మల్ల తెల్లారి తాళమే. "ఈళ్లు లేరా! అని పక్కకున్న ఇల్లు గల్లామెనడిగిన. 'అల్ల పాప సచ్చిపొయ్యింది' ఆయినను పోలీసులు పట్కపొయ్యిండ్రు, ఆమె ఏడికి పొయ్యిందో తెల్వదు, సామానంత ఇంట్లోనే వుంది, ఈనెల కిరాయి గూడ ఇయ్యలే"నారునగా జెప్పింది ఆ ఇంటామె. ఇదేదో కథనే జరిగిందని పెద్దమ్మకు చెప్పిన. 'అవు బిడ్డా నువ్వు ఆయాల్ల

## కాల శిల్పం

గున గునమంటూ గింజులేరుకునే
పావురాల్ని చూసినప్పుడల్లా
కొత్త పెళ్ళి కూతురు గుర్తుకొస్తూ ఉంటుంది
ముక్కు నుంచి కాళ్ళ దాకా
ప్రతీ అంగానికో రంగులో శోభిల్లుతుంటే!

నెత్తి మీద ముద్ద మందారాన్ని మోస్తున్నట్లుంది
నడిచే కోడిపుంజును చూసినపుడు
ఆ పై దాని మేను
వొలిచిన దానిమ్మ రుచులు చూపిస్తూ ఉంటుంది.
వొంటికీ, కాలానికీ
నిత్యం మేకప్ అంటుకునే ఉంటుంది
అరుపులు, ఆనందాలు
కేకలు, కవ్వింపులు



పెడబొబ్బలు ఊరుతునే ఉంటాయి
నడక వెంబడి ధూళిలా
కాలం వెంట ఊహలు
రుతువులు మాట తప్పతాయోమో గాని
మృత్యువు ఓ సుందరమైన కాలశిల్పం!
పెళ్ళి గాని, చావు గాని మిగిల్చే ఆవేశాలు
అందంగా ఉంటాయి, ఆదర్శంగా ఉంటాయి
ఈ కొండలని , ఈసముద్రాలని
ఇలా బతకనీయండి
బ్రతికున్న వాళ్ళని వాటితో సేదతీరనీయండి
మాటలు రాని ప్రకృతి
నీవు కాల శిల్పానికి సాక్షివి
నీ దయంబుధి మానవ జీవన నిధి
ప్రకృతీకరుణించకు!
మనిషి మాట తప్పినపుడు

–ఒబ్బిని

పగలింటికి రాలే, రాత్రికొచ్చినవ్ ఒచ్చేవరకే అంత ఐపోయింది. ఆ పసిదాన్ని ఉచ్చితార్థంగ సంపె ఆ ముండకొడుకు' అన్నది పెద్దమ్మ. సుట్టు పట్ల ఎవ్వరు బాధపడ్డా, సచ్చినా పనంత ఇడిసి పెట్టి పొయ్యి ఏడ్సివస్తది మా పెద్దమ్మ. ఎవ్వరికి ఏ ఆపదొచ్చినా తనదే అని అంగలార్పుతది. ఆయాళ్ల వాకు పాప సచ్చిన సంగతి జెప్పిందట గని పాలు పోసే తొందర్ల నేను ఏ దావఖాన్ల ఎవ్వరో అనుకున్న ఈ 'అమ్మా! పాల మామియ్యా' అనే పాపేనని తెల్వదు. ఆ పాప రూపం, ఆ పాలనవ్వును, ఆ వెన్నెల వెలుగును సంపుతందుకు ఆనికి సేతులెట్లొచ్చినయో!

ఎన్కశిరి తెల్సింది. వెంకటేశ్వరరావుకు భార్య మీద ఎప్పుడూ అనుమానమే. ఎంత నన్నానంటే ఒక్కోసారి ఆఫీసుకు పొయ్యేటప్పుడు ఆమె నింట్లేషి బైటికెళ్లి తాళం వేసి పోతుండెనట. ఆమె బజారుకు పొయ్యినా, బైటనిలవడ్డా, ఇంటిపక్క ఆడి మనిషితోటి మాట్లాడినా తిట్లు తప్పవట. ఊరిమంచి హైకోర్టు పనిమీదనో ఇంకేదన్నా పనుండో ఎవరన్నా సుట్టాలొస్తే ఆడు ఆఫీసుకు పోక పెండ్లాం కావలి ఇంట్ల కూసుంటుండెనట. పెండ్లి చేసుకున్న మండి అమ్మగారి ఇంటికి పంపలేదట. ఆమె ఒక్కరోజు రెండు రోజులు పొయ్యేది చైతన్యపురిలున్న ఆళ్ల మొగడులేని అక్కదెగ్గరికట. ఆమె ఈన రోడ్డు మీద నడుస్తుంటే ఎవడన్నా ఆమె దిక్కు సూస్తే ఆడెందుకు నిన్ను జూసిండని ఈమెను తిట్టేటోడట. ఆటో తప్ప బస్సుల ఎక్కనిచ్చెటోడు గాదు. బస్సుల మంచోళ్లు ఎక్కరని. సినిమాలు గాదు పక్కోళ్లు పిలిస్తే పసుపు బొట్టుకైనా పోవొద్దు, శనివారం పూట గుడిల జనం ఎక్కువ ఉంటరని ఎవ్వడన్న ఆమెను తొక్కుతరని మంగళవారం గుడికి పోదామనెటోడట.

వెంకటేశ్వరరావుది మంచి కుటుంబమని ఆమె తండ్రి వాల్లుగలక్షలు కట్నమిచ్చి పెండ్లి జేసిండట. సర్వే ఆఫ్ ఇండియా ఉద్యోగంల ఈన ఆ ఊరు ఈ ఊరు తిరుగుతడని ముందు ఈమె అనుకోలె. "చిన్నప్పటి మండి పేరు పెట్న మేనబావను చేసుకుంటే పుట్టిపెరిగిన చోటనే ఉంటుండే గదా! నన్ను జేసుకోవాలని ఆయనకెంతో ఇష్టముండే, నేనంటే పానమెల్లగొట్టుకుంటుండె" అని ఎప్పుడో ఎందుకన్నదో అప్పటినుంచి ఆనికి అనుమానం–ఈమెకు, ఈమె మేనబావకు ఏదో సంబంధముందని. పెండ్లైన కొత్తల పదిరోజులు తల్లిగారింటి దెగ్గర వున్నందుకు పాప పుట్టి రొండున్నర యేండ్ల తర్వాత, "ఈ పాప మీ బావకు కన్నావా? నాకే పుట్టిందా?" అని అడగవట్టిండట. ఆమె ఎంత ఏడ్సి మొత్తుకున్నా, ఎన్ని ఒట్లు ధర్మాలు తిన్నా, తల్లిగారింటికి పూర్తిగ బందైనా ఆని అనుమానం తీరలే.

వాకిప్పుడు గుర్తుకొస్తుంది. పదిహేడు తారీకున పాలు పోస్తుంటే గుడ్లు గూర్కాయించి మిర్ర మిర్ర జూసిండు. పద్దెనిమిదినాడు నన్ను జూడంగనే "ఏరా! ఎప్పుడొచ్చావ్ రాజమండ్రి నుండీ" అన్నడు. "అయ్యా నేను చెంద్రయ్యను" అనంగనే బెదిరి బెదిరి జూసుకుంట ఎల్లిపోయిండు. పందొమ్మిదినాడు ఆమెనే పాలు దీస్కుంది. ఆ మల్ల నే పొద్దుగల్ల ఇద్దరు శాన సేపు కొట్లాడుకున్నరట. ఆడు ఆమె బావ సంగతి మల్ల మల్ల అడిగిండట. ఎప్పుడు జెయ్యంది ఆమె ఆరోజు నోరు బాగ జేసిందట. ఆయాల్ల పగలే ఆమె బాత్‌రూంల ఉండంగ పండుకున్న పాపకు ఇస్త్రీ పెట్టేనైరు మెడకు సుట్టి గుంజి సంపిండంట. మల్ల ఆడే పోలీసుల పొయ్యి చెప్పిండట పాపను సంపిన్నని. పాప శవం ఎటుపొయ్యిందో? పాప తల్లిని ఎవరు తోల్కపొయ్యిండ్రో? అన్ని పిచ్చోల్ల దవఖాన్ల శరీకు జేసిండ్రని తెలిసింది.

వసంతా! ఆడు పెరిగిన పరిస్థితి, ఆని అలవాట్లు, ఆని స్నేహం, ఆ పైన మంద గదా ఈ పని జేపిచ్చింది? దీంట్ల ఆమె తప్ప చిటికెనేలు గోరంత గూడున్నదా? మొగోన్ని గదా అని అర్థం పర్థం లేకుంట ఆమె మనసుకు యదార్థం లేకుండా బతుకు నాశనం జేసిండు. మనిషి మనుగడ మొదలైన కాడికెల్లి చరిత్ర నిండ ఆడోళ్ల కండ్ల నీళ్లు, ఆర్తనాదాలు, ఆక్రందనలు, శోకాలే కనిపిస్తయి. ఆళ్లతోటి గొడ్డు చాకిరి చేపిచ్చుకొని అణగదొక్కుడే వుంటది.

వసంతా! ఈ ఉత్తరం ఇయ్యాల పగలు మురికి కాల్వ కట్టమీద తుమ్మ సెట్టుకింద కూసోని రాస్తున్న. మూసీనది అవుతలికెల్లి మల్లెతోటల పూలేరుతున్న ఆడోళ్ల పాట ఇనిపిస్తుంది. ఆళ్లల్ల నువ్వున్నవేమో అనిపిస్తుంది. నిన్ను జూడాలెనని ఇద్దరమే ఎన్నో మాట్లాడుకోవాలెనని మనసంత నీ దిక్కు నీకుతుంటే నీలువట్ట్ దబ్బున్నే ఒకసారి ఒస్త. పైస లేమన్న పంపాలెనా? ఉన్నాయా? ఉత్తరం రాయి.

నీ

చంద్రం.

24.10'80.